పరాయి మగాడితో
తిరుగుతున్న
చెల్లెలు అన్నకు
చెప్పిన గుణపాఠం?

# తానొకటి తలిస్తే




నరహరి ఎంతో కష్టపడి ఒక ఫ్యాక్టరీలో చిన్న ఉద్యోగం సంపాదించాడు. రావడానికి నెలకు మూడువేల రూపాయల దాకా జీతం వస్తుంది. కాని జీతం తీసుకున్న మర్నాడే జేబులు ఖాళీ.

అతని కుటుంబంలో అంతా కలిసి ఐదుగురు సభ్యులు. ఇద్దరు పిల్లలు, తను, తన భార్య, తన చెల్లెలు.

కుటుంబ భారమంతా తానే మోయాలి వచ్చే జీతం డబ్బుల మీదే అంతా ఆధారపడాలి. అన్నింటికిమించి అతను తన ఎదిగిన చెల్లెలికి వివాహం చేయాలి. పిల్లలిద్దర్నీ పెంచి ప్రయోజకుల్ని చేయాలి. ప్రతి వ్యక్తికీ బాధ్యతలుంటాయి. మరి వాటివి తప్పించుకోవడం ఎవరితరం.

ఆ రోజున నరహరి ఎందుకో కొంచెం కలవరంగానే వున్నాడు. ముఖ్యంగా తనచేతిలో చిల్లిగవ్వలేదని మథన పడుతున్నాడు.

ఫ్యాక్టరీ పని ముగించుకుని నరహరి ఇంటిదారి పట్టాడు. ప్రక్కనుంచి ఒక స్కూటరు దూసుకుంటూ ముందుకుపోయింది. తలెత్తి చూసేసరికి తన చెల్లెలు సరిత మరొక అబ్బాయితో స్కూటరుమీద ఎక్కడికో వెళుతుంది.

తెలియనివారు వాళ్ళిద్దరిని చూసి నూతన దంపతులనుకున్నా ఆశ్చర్యపడనవసరంలేదు.

ఇది అనుకోని సంఘటన. నరహరి తల ఎత్తేసరికి సరిత అన్నగారి కళ్ళలోనికి అప్రయత్నంగా చూసింది.

ఒకరినొకరు పలకరించుకోబోయారు. కాని ఎవరూ పెదవి కదపలేదు.




స్కూటరు నడుపుతున్న వ్యక్తి తనకేమీ పట్టనట్టు జనాల్ని చీల్చుకుంటూ ముందుకు సాగిపోయాడు.

ఇదంతా ఒక రెప్పపాటు కాలంలో జరిగిన సంఘటన.

నరహరికి మాత్రం ముచ్చెమటలు పోసాయి. పరాయివానితో తన చెల్లెలు స్కూటరు మీద తన పక్క నుంచి దూసుకుంటూ

వెళ్ళిందంటే అక్కడే అతని అసమర్థత కొట్టవచ్చినట్టు కనపడుతుంది. తన చెల్లెలు విషయంలో తను చేసిన తప్పేమిటి? ఉన్నంతలో తను దానికి లోటేమీ చేయలేదే! కాకపోతే కాలేజీ చదువుకు మించి తను ఆమెను చదివించలేకపోయాడు.

కారణం అది తన ఆర్థిక పరిస్థితి. అది సరితకు కూడా తెలుసు.

ఈ మధ్య సరిత తనకు తెలియకుండా కొన్ని ట్యూషన్లు చెప్తుందిట. అదీ తన భార్య సుశీల చెప్తే తెలిసింది. సరే! 'ఎదిగిన పిల్ల తనెందుకు అభ్యంతరం చెప్పాలి. దాని బాధ్యత దానికి తెలుసు' అని సరిపెట్టుకున్నాడు.

మరి, నేడు ఈ విపరీత ధోరణి ఏమిటి?

బహుశ తనను చెల్లెలికి వివాహం చేయలేని అసమర్థుడిగ జమకట్టిందా?

నరహరి మనసు మనసులో లేదు. ఇల్లు చేరుకుంటేగాని అసలు సంగతి తెలియదు.

'ఏమోయ్! నరహరి, ఏమిటి పరాకుగా నడుస్తున్నావ్!

ట్రాఫిక్ హెవీగా వుంది కొంచెం జాగ్రత్తగ నడు' అంటూ వెనక నుంచి హెచ్చరిస్తూ గణపతి నరహరిని చేరుకున్నాడు.

'ఆ! ఏమీ లేదు.'

'ఎక్కడ నుంచి రాక. హఠాత్తుగా ఊడిపడ్డావ్'.

అని లేని నవ్వు తెచ్చుకుని, గణపతిని పలకరించాడు నరహరి.

మిత్రులిద్దరూ పిచ్చాపాటి మాట్లాడుకుంటూ నడకసాగించారు.

'అన్నట్టు మరిచాను. ఏమిటోయ్ నీ చెల్లెలు సరితకి మధ్య వివాహం చేసావా? ఎవరికీ చెప్పాపెట్టకుండా!

ఒక గంట ముందు ఎవరో ఒక నూతన వ్యక్తితో కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ స్కూటరు మీద ఈవైపే వెళ్ళింది. నీ కంట పడలే!' అని చాలా సాధారణంగా అడిగాడు గణపతి.

నరహరికి నెత్తిన పిడుగు పడ్డట్టయింది.

మరి ఏం సమాధానం చెప్తాడు?

నోట మాట రాలేదు. కాని ఏదో సమాధానం చెప్పాలి కదా! లేని ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుని.

'ఏమీ లేదోయ్ వివాహం ఇంకా కాలేదు. కాని ఆ ప్రయత్నంలోనే వున్నాను.

నువ్వు చూసిన ఆ నూతన వ్యక్తి ఎవరో కాదు సరితను వివాహం చేసుకోబోయేకుర్రాడు.

మొన్ననే పోస్టుగ్రాడ్యుయేట్ పట్టా తీసుకున్నాడుట. చాలమంచివాడు.

ఉద్యోగ ప్రయత్నంలోవున్నాడు.

అతని తలితండ్రులు కూడ చాలమంచివారు. నా దగ్గర తండ్రి తాతలు కూడబెట్టిన పిత్రార్జితమేమీ లేదు.

రెక్కల కష్టమేకదా! నా అదృష్టం బావుండి సుశీలలాంటి ఉత్తమురాలు నా ఇల్లాలయింది. నేను సంపాదించే జీతం రాళ్ళతో ఇల్లు నెట్టుకొస్తుంది'.

'మరి తొందరలోనే ముహూర్తం పెట్టించవయ్యా! రోజులు అంత బావుండలేదు. ఆ తరువాత ఏది ఏమైనా, కడుపు చించు

కుంటే కాళ్ళమీద పడుతుంది.' అని సలహా ఇచ్చాడు గణపతి.

'ఈ విషయం విన్నావా? మన చలపతి ఈ మధ్య కొంత సొమ్ము వెనకేసినట్లున్నాడు.

చాలాసేపు మా మధ్య నీ ప్రసక్తి వచ్చింది. నీ లాటరీ పిచ్చి అతనికి అరికాలి మంట. అనవసరంగా నీవు లాటరీలకు డబ్బు తగలేస్తున్నావని అతని ఆరోపణ' అన్నాడు గణపతి.

ఈ మాటలకు నరహరి కొంచెం చీకాకనిపించింది.

'ఏమిటి ఎవరు చూసినా నన్ను దుయ్యబట్టేవారే! ఎవరేమన్నా అనుకున్నా తనేమీ సమాధానం చెప్పలేదు. పరిస్థితి అటువంటిది.

ఇంతలో పెద్దశబ్దమైంది. రోడ్డుమీద వెళ్ళే ప్రతివాడి దృష్టీ అటువైపే వెళ్ళింది.

నరహరి, గణపతి అటువైపే పరుగెత్తారు.

తీరా చూసేసరికి ఒక ఘోరమైన దృశ్యం కంటపడింది.

అది ఒక ఏక్సిడెంట్.

భార్యా, భర్త స్కూటరు మీద ఎటో వెళుతూ లారీ క్రిందకు వెళ్ళిపోయారు.

పరిస్థితి చూస్తే ఎవరూ ప్రాణాలతో బయటపడినట్టు లేదు. నట్టి నడిరోడ్డుమీద ఘోరప్రమాదం. అక్కడ గుమిగూడిన జనం నోట మాటలేదు.


రోడ్డంతా రక్తపు మడుగు.

నరహరికి ప్రమాద దృశ్యం చూసాక కాళ్ళలోంచి దడపుట్టుకొచ్చింది. ఈలోగా షాక్ నుంచి తేరుకున్న గణపతి

'నరహరీ! మళ్ళీ కలుద్దాం వస్తా!' అంటూ ముందుకు సాగిపోయాడు.

అతని మనసంతా అల్లకల్లోలంగావుంది.

ఫ్యాక్టరీకి వచ్చేముందు కొడుకు వాసు క్లాసు పుస్తకమేదోకొని తెమ్మని చెప్పాడు. అదిలేకపోతే రేపు టీచరు క్లాసులోకి రానివ్వరని గోల చేసాడు. అప్రయత్నంగా జేబు



లోకి చేతులు పోనిచ్చి కొడుకు వ్రాసిచ్చిన చీటి కోసం వెదికాడు.

కాని చేతికి తను ప్రొద్దున్న కొన్న లాటరీ టిక్కెట్ల కట్ట తగిలింది. అవి డైలీ లాటరీ టిక్కెట్లు. తను ముకుందం దగ్గర తీసుకున్న వంద రూపాయలు లాటరీ టిక్కెట్ల కోసం ప్రొద్దునే తగలేసాడు. ఒక్క నెంబరు కూడ తగలలేదు. ప్రస్తుతం చేతిలో పైసా లేదు. కొడుకు అడిగిన పుస్తకం పది రూపాయలకం టే ఎక్కువ వుండదు. అది వాడి ఉజ్వల భవిష్యత్తుకు పునాది. మరి తనా పుస్తకం కొందామంటే దగ్గర ప్రస్తుతం డబ్బులేదు.

ఇదేకాదు ఆ మధ్య సుశీల అపరాలు తెమ్మని ఇచ్చిన రెండు వందలు ఇలాగే హుష్ కాకి అయిపోయాయి. మొన్నటికి మొన్న చంటిదాని బట్టలకోసం వంద రూపాయలు తీసుకువెళ్ళి మార్కెట్టులో ఈ లాటరీలకే సమర్పించాడు. ఈ లాటరీ టిక్కెట్లంటే తనకెందుకింత బలహీనత?

ఈలోగా ఇల్లు రానే వచ్చింది. అంతటా నిశ్శబ్దం.

తలుపు తట్టగానే సుశీల తలుపు తీసింది . కాని ముఖంలో కళాకాంతులు లేవు. ఏమిటలావున్నావని యధాలాపంగా అడిగాడు భార్యను.

సుశీల ఒక కవరు చేతికందించింది. అది తన చెల్లెలు సరిత రైటింగ్‌లావుంది.

లోపలి ఒక ఉత్తరం వుంది. తీసి చదవసాగాడు.

ప్రియమైన నరహరన్నా,

నీ చెల్లెలు నీకు దూరంగా వెళ్ళిపోతుంది ఇక కనిపించదు. తెలియకుండానే, నేను చేయగూడని తప్పు చేసాను. కల్లబొల్లి కబుర్లు నమ్మి నా స్నేహితురాలి కజిన్‌తో స్నేహం పెంచుకున్నాను. అతని పేరు 'రాణా'. ఫలితంగా నాలో వాడి రూపం పెరుగుతుంది. నాకీ విషయం వారం రోజుల క్రిందటే తెల్సింది. విషయం చెప్పి వివాహం చేసుకోమని బతిమిలాడాను. ఆ మూర్ఖుడు నా మాట వినిపించుకోవడం లేదు. తన తల్లిదండ్రులకు కట్న పిశాచం రోగముందిట. కనీసం లక్ష రూపాయలు కట్నమిస్తే తప్ప మా అనుబంధం శాశ్వతంగా వుండదని నిష్కర్షగా చెప్పేసాడు. మరంత సొమ్ము మన దగ్గరకు ఎలా వస్తుందన్నా! లాటరీ టిక్కెట్ల మీద మనం లక్షలు అక్షరాలు చూడగలం. అంకెలతో తృప్తి పడి ఆశపడతాం! కాని అంత సొమ్ము మనకొస్తుందన్న ఆశ నాకెప్పుడూ లేదు. ఇక గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకుందామనుకున్నా. కాని పిరికితనమనిపించింది. నన్ను మోసగించిన వానిని మోసంతోనే తుదముట్టించాలనిపించింది. ఎలాగో అలాగ వాణ్ణి చంపి నే చస్తా! చూస్తావుగా! సుశీలొదినను పిల్లలను జాగ్రత్తగా చూసుకో.

అన్నా! ఈ లాటరీల మీద ఆశతోనే చేతికి వచ్చే ఆ జీతం డబ్బులు పోగొట్టుకోకన్నా!

ఇట్లు
నీ చెల్లెలు
సరిత.

ఎంత పని జరిగింది. ఎంత సాహసం .

వేసింది! మరి తనను మోసగించిన వానిని చంపేసిందా?

ఒక్కసారి నరహరికి తాను చూసిన ఏక్సిడెంట్ గుర్తుకొచ్చింది. తన చెల్లెలి మృతదేహాన్ని ఊహించుకోలేకపోయాడు.

కళ్ళ వెంబడి కన్నీళ్ళు కడవలై కారుతున్నాయి. తనిక లాటరీల జోలికి పోడు. గణపతిలా వడ్డీ డబ్బుల కోసం అప్పులిచ్చి తాపత్రయపడడు. పొదుపు పథకాలు అమలు చేసుకుంటాడు.

ఇంతలో

స్కూటరాగిన శబ్దం. అదే ధ్వని ఇంకా తన చెవులలో గింగిర్లాడుతుంది.

సరిత, ఆ కొత్త కుర్రాడు తనను దూసుకుంటూ ముందుకేగిన దృశ్యం మళ్ళీ ఊహలోకి వచ్చింది.

రండి! రండి! అన్నీ రెడీ! అంటూ సుశీల ముసిముసి నవ్వులతో ఎవరినో ఆహ్వానిస్తూ లోపలకు తీసుకువస్తుంది.

నరహరి అప్రయత్నంగా వీధివైపు చూసాడు.

ఎవరో కాదు! సరిత, కొత్త కుర్రాడు రాణా. నిండుగా పూల దండలతో చకచకా ముందుకు నడచి నరహరి పాదాల మీదకు ఒక్కసారిగా వంగారు.

ఇది కలా! నిజమా! ఏమిటో అయోమయం. నరహరి మళ్ళీ ఆలోచనలోకి జారుకున్నాడు.

మిమ్మల్నే. వాళ్ళనాశీర్వదించండి. ఇదంతా మీ చెల్లెమ్మగారి నాటకం. మీకు లాటరీ పిచ్చి వదిలించాలని. వారిరువురు ఇది వరకే వివాహం చేసుకుందామనుకున్నారు. అంది సుశీల.

నరహరి నిండుగా నూతన దంపతులను ఆశీర్వదించి అలాగే వుండిపోయాడు.



## నొప్పులు!

"మీ ఆవిడకు మోకాళ్ల నొప్పులన్నావ్. ఇప్పుడెలా వుంది" అడిగాడు రామయ్య.

"అది వృద్ధాప్యపు లక్షణం అన్నారు డాక్టర్. అప్పటినుండి నొప్పులేం లేవు అంటోంది" చెప్పాడు రామయ్య నవ్వుతూ.

—రాంపల్లి దశరథం (నిజామాబాద్)